ఆ రోడ్డు గుంతలమయం..!



కంకర తేలిన గూడూర్–శివారెడ్డిపల్లి రోడ్డు

- అధ్వానంగా గూడూర్–శివారెడ్డిపల్లి
- అడుగడుగునా కంకర తేలినదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దోమ: ప్రతీ పల్లెకు బీటీ రోడ్డు వేస్తున్నామని చెబుతున్నప్పటికీ అవి ఆచరణకు నోచుకోవడం లేదు. మండల పరిధిలోని గూడూర్ నుంచి శివారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన మెటల్ రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంకర తేలి, గుంతలుగా మారి మరింతగా రోడ్డు పాడయ్యాయి. దీంతో అవీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఈ రోడ్డు మార్గం నుంచి అనేక మంది ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. కానీ కంకర తేలి, గుంతలుగా ఉండడంతో ఆవైపుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు.

ప్రయాణం నరకం..

గూడూర్, శివారెడ్డిపల్లి రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం పరిగి పట్టణం, దోమ మండల కేంద్రానికి నిత్యం వెళ్తున్నప్పటికీ రోడ్డు పూర్తిగా కంకర తేలి ఇబ్బందికరంగా తయారైంది. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే నానా ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ప్రయాణం సాగించాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని మండిపడుతున్నారు. ఇతర మార్గాల నుంచి పట్టణ కేంద్రాలకు వైద్యం, ఇతర అవసరాలకు వెళ్లాలంటే దూర భారం ఎక్కువవుతుందని చెబుతున్నారు. ఈ రోడ్డు మార్గం నుంచి పట్టణ కేంద్రాలకు ప్రయాణం సాగించాలంటే ఎటు చూసినా 14 కిలోమీటర్ల దూరం ఉంటుందని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. కంకర తేలడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని జంకుతున్నామని వాపోతున్నారు.

కంకరతేలి..

గుంతల మయంగా మారిన రోడ్డు గురించి పలుమార్లు మండల స్థాయి అధికారులకు తెలిపినా ఫలితంలేదు. కంకర తేలి అధ్వానంగా మారిందని, రైతులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని విన్నవించినా పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడ్డారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి వెంటనే నూతన బీటీ రోడ్డు వేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని..



అకాల వర్షాలు కురవడంతో శివారెడ్డిపల్లి–గూడూర్ వెళ్లే ప్రధాన మెటల్ రోడ్డు కంకర తేలి, గుంతలుగా తయారయి పూర్తిగా పాడైయ్యాయి. దీంతో అటుగా వెళ్లాలంటేనే నానా ఇబ్బందులకు గురవుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డును వేయించేలా చర్యలు తీసుకోవాలి.

– నర్సింహులు, శివారెడ్డిపల్లి గ్రామస్తుడు

ఇబ్బందులు తొలగిస్తాం..



శివారెడ్డిపల్లి–గూడూర్ వెళ్లే ప్రధాన మెటల్ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ విషయం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయించారు. త్వరలో ఎమ్మెల్యేతో రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తాం.

– అర్జున్ రెడ్డి, శివారెడ్డిపల్లి గ్రామం, కాంగ్రెస్‌నేత

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

- మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్
- 22 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కొడంగల్: కంటి పరీక్షలు చేస్తున్న హరినాథ్

కొడంగల్: పేదలకు సేవ చేయడమే లక్ష్యమని కొడంగల్ లయన్స్ క్లబ్ ఫౌండర్ మెంబర్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ వైద్య పరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్న 60 మందిని పరీక్షించారు. అందులో 22 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్దప్ప దేశ్‌ముఖ్ మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ సేవా భావం అలవర్చుకోవలన్నారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో దంత, రక్తదాన శిబిరం, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, మొక్కలు నాటడం, చెవిటి వారికి వినికిడి మిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. దాసప్ప యాదవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు శివ కుమార్ గుప్తా, తీర్థాచారి, మిఠాయి రాజు, మునీర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

అనంతగిరి: వికారాబాద్‌లోని సాయిరాం ఆస్పత్రిలో శ్రీ సత్యసాయి సేవా సమితి, మ్యాక్స్‌విజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 95మందికి కంటి పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. సేవా సమితి కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, ఆప్తమాలజిస్టు సంగీత, టెక్నీషియన్ రాజు, జ్యోతి, బసవేశ్వర్, వేణుగోపాల్, సుధీర్ పటేల్, వసంత్, పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అసెంబ్లీ స్పీకర్ తనయ అనన్య



మాట్లాడుతున్న అనన్య

బంట్వారం: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అసెంబ్లీ స్పీకర్ తనయ అనన్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తొర్మామిడిలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కి ఆమె హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఉద్యోగ నియామకాల్లో కూడా క్రీడాకారులకు తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఇలాంటి పోటీలతోనే క్రీడల్లో దాగి ఉన్న నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులతోపాటు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేషం, టోర్నమెంట్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధారూరు పీహెచ్‌సీ డాక్టర్‌గా నిషాసింగ్



ధారూరు: ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా నిషాసింగ్ నియమితులయ్యారు. నూతన నియామకంలో భాగంగా ఆమెను ధారూరు పీహెచ్‌సీకి పంపించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ సుష్మా భార్యాభర్తల బదిలీలో భాగంగా సంగారెడ్డికి వెళ్లారు.

అర్హులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయండి

కొడంగల్: నియోజకవర్గంలో అర్హులైన పేదలను గుర్తించి ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి అర్హులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బుస్స చంద్రయ్య, కొత్తూరు చంద్రయ్య, రమేష్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, బలరాం, జయప్ప, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పరిగి: మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాలల ఆత్మగౌరవసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 27న నాగర్‌కర్నూల్‌లోని పీవీరావు సభ ప్రాంగణంలో మాలల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తారన్నారు. ఈ సభలో మాలలు పాల్గొని తమ ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ముత్యాప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నర్సింహులు, జంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు ముదిరాజ్



ఆంజనేయులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుల్కచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్‌ను పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యున్నతికి కష్టపడిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కురుమ సంఘం ప్రతినిధులు

తాండూరు టౌన్: నూతన ఉపాధ్యాయులను కురుమ సంఘం నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎన్నికైన దోమ శ్రీశైలం, దండు నగేష్, కంబళ్ల రాఘవేందర్, గౌడి సుప్రియ, నరేష్, రాజ్‌కుమార్, బీరప్ప, అశోక్, శ్రీనివాస్‌లను శాలువా కప్పి పూలమాలలు వేసి కురుమ సంఘం పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకే ఏడాది తొమ్మిది మంది కురుమకులానికి చెందిన అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. అడ్వకేట్ గోపాల్, పలు మండలాలకు చెందిన సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువులో నిర్లక్ష్యం వద్దు

మండల విద్యాధికారి వెంకట్



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: విద్యార్థుల చదువు విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండొద్దని మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు. గురువారం దోమ మండల పరిధిలోని మోత్కుర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి పరిసరాలను, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి తెలుగు, ఇంగ్లీష్, గణితం సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ వర్క్ షీట్స్, బోధనోపకరణాలు, టీఎల్ఎంను ఉపయోగించి విద్యార్థులకు అర్థవంతమైన బోధన చేయాలన్నారు. ఎఫ్ఎ1, ఎఫ్ఎ2, బేస్‌లైన్ టెస్ట్, యూడైస్ నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని మెనూ ప్రకారం పెట్టాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, ఆంజనేయులుగౌడ్, అమర్‌నాథ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ల ఎంపికపై హర్షం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ల ఎంపికపై మండల డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా ఎన్నుకోవడంలో భాగంగా తుంకిమెట్లకు చెందిన కాంగ్రెస్ యువజన విభాగం సీనియర్ నాయకుడు బలిజ మల్లేశ్, జానకంపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ అంజిలయ్య, బొంరాస్‌పేట మాజీ సర్పంచు చెన్నమ్మ, మందన్‌పల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్‌లను కొడంగల్ ఏఎంసీ డైరెక్టర్లుగా ఎంపికచేయడంతో మండలానికి సముచిత స్థానం లభించిందని వారన్నారు. సరైన విధంగా తమకు న్యాయం కల్పించారని తిరుపతిరెడ్డి నాయకత్వాన్ని ఈ సందర్భంగా మెచ్చుకున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు నా యుడు, రాంచంద్రారెడ్డి, ఏర్పుమళ్ల అంజిల్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, తుంకిమెట్ల అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు 3కే రన్

అనంతగిరి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6.30గంటల నుంచి 8గంటల వరకు వికారాబాద్‌లో 3కే రన్‌తో పాటు సైకిల్ ర్యాలీ ఉంటుందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. అనంతగిరి రోడ్డులో ఫారెస్టు కార్యాలయం నుంచి హరిత రిసార్ట్స్ వరకు ఉంటుందన్నారు. అనంతరం 10.30 గంటలకు పోలీస్ శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరం ఉంటుందని తెలిపారు.

• పాఠశాల భవనానికి మరమ్మతులు

దుద్యాల్: మండల పరిధిలోని రోటిబండ తండా పాఠశాలకు గురువారం మరమ్మతులు నిర్వహించారు. పాఠశాలకు కిటికీలు ఊడిపోవడంతో బిగించినట్లు పంచాయతీ కార్యదర్శి ఆనంద్ తెలిపారు. దాంతో పాటు పాఠశాల భవనం కురుస్తుండడంతో స్లాబ్‌పై సిమెంట్ కూడా వేయించారన్నారు.

• విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల హెచ్ఎం అబ్దుల్ కొంత మంది విద్యార్థులను కొట్టారని విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు పాఠశాలకు వెళ్లి హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై హెచ్ఎంను వివరణ కోరగా...మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదిలో అల్లరి చేస్తున్న విద్యార్థులను మందలించానని బదులిచ్చారు. ఏ విద్యార్థిని కొట్టలేదన్నారు.

• వేలంలో సమకూరిన ఆదాయం

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఆలయానికి రూ.4.85లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నరేందర్ తెలిపారు. ఆలయ ఆవరణలో నెల రోజుల పాటు టెంకాయలు అమ్ముకునేందుకు వికారాబాద్‌కు చెందిన హరీశ్వర్ రూ. 3.85లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. దీపారాధన సామగ్రి రూ.లక్షకు పాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

• పశువులకు టీకాలు తప్పనిసరి

పూడూరు: రైతులు పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి సదానందం తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లి, మేడిపల్లికలాన్ గ్రామాల్లో 350 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సహాయ సంచాలకులు విజయలక్ష్మి, బయోలాజికల్ ఇనిస్టిట్యూట్ సహాయ సంచాలకులు డాక్టర్ కల్యాణి, పూడూరు వైద్యాధికారి సుజాత్‌అలీ, మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

• నాణ్యమైన భోజనం అందించాలి

కుల్కచర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, సీఆర్పీ గాంగ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్


తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాతే తాండూరు పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. గురువారం 14వ వార్డులో కౌన్సిలర్ బాంబినాతో కలిసి సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. అధికారంలోకొచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామన్నారు. అనంతరం కౌన్సిలర్ బాంబినా మాట్లాడారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఇంజనీర్ ఖాజా హుస్సేన్, ఇస్మాయిల్, మునీర్, రవూఫ్‌ఖాన్, అబ్రార్ లాలా, ముజాయిద్, రియాజ్, సుమేర్‌లాలా, యూనస్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఇంగ్లిష్ టీచర్‌ను నియమించండి

మర్పల్లి: మండల పరిధిలోని కోట్‌మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇంగ్లిష్ టీచర్‌ను నియమంచాలని విద్యార్థుల తల్లితండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల క్రితం జిల్లా విద్యాధికారిణి రేణుకదేవికి సైతం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతకాలంగా విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు, సబ్‌జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువుల్లో రాణించ లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన నియామకాల్లో భాగంగా ప్రభుత్వం ఇంగ్లిష్ టీచర్‌ను భర్తీ చేసినప్పటికీ తిరిగి డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు బదిలీ చేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి ఇంగ్లిష్‌టీచర్‌ను తమ పాఠశాలకు నియమించాలని కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

పూడూరు: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి గేటు నుంచి సోమన్‌గుర్తి స్టీల్ ఫ్యాక్టరి వరకు ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ అధికారులతో కలిసి నియంత్రికలను ఏర్పాటు చేసే స్థలాలను గుర్తించారు. అనంతరం హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా రాంబుల్ స్ట్రిప్స్, జీబ్రాక్రాసింగ్ లైన్స్‌లను వేయించారు.



పూడూరు గేటు వద్ద స్ట్రిప్స్ వేయిస్తున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



తాండూరు టౌన్: సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



ధారూరు: సభ్యత్వం చేయిస్తున్న బీజేపీ కో ఆర్డినేటర్ నందు

జిల్లా కార్యవర్గ సభ్యుడు శేరిరాంరెడ్డి

దోమ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా కార్యవర్గ సభ్యుడు శేరిరాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం దొంగ ఎన్కేపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. చేతకాని హామీలు ఇచ్చి అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, ఆంజనేయులు, చెన్నయ్య, శివకుమార్, సత్యయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: అన్ని వర్గాల వారికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి కిరణ్ కుమార్ తెలిపారు. తాండూరు పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుల, మత , వర్గ విభేదాలు లేకుండా అందరికీ పార్టీలో సముచిత స్థానం బీజేపీ కల్పిస్తోందన్నారు. ప్రధాని మోడీ సుపరిపాలన, దేశ ఆర్థికాభివృద్ధికి ఆకర్షితులైన అనేక మంది సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ బంటారం భద్రేశ్వర్, అంతారం లలిత, పట్టణ సభ్యత్వ ప్రముఖ్ దోమ కృష్ణ, సాహు శ్రీలత, శ్రీకాంత్, కిరణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: బీజేపీ సభ్యత్వాలను విరివిగా చేయించి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని వికారాబాద్ నియోజకవర్గ బీజేపీ కో ఆర్డినేటర్ వడ్లనందు పేర్కొన్నారు. ధారూరు మండల పరిధిలోని రుద్రారం, అవుసుపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులంతా కలిసి అన్ని గ్రామాలు, తండాల్లోని ప్రజలతో ఆన్‌లైన్ సభ్యత్వాలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రాజునాయక్, మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు రుద్రారం వెంకటయ్య, మాజీ సర్పంచులు రాంచంద్రయ్య, యాదగిరి, ఉపేందర్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: దేశ ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. పట్టణ కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చేరేల చేసింది ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. ప్రపంచం మొత్తం భారత దేశం వైపు చూస్తుందన్నారు. దేశంలోని యువత అన్నివర్గాల ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, రామచంద్రయ్య, రాముయాదవ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ

మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ

పెద్దేముల్: కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళ సమైఖ్య భవనంలో మండల 16వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రతీవారం ప్రైవేట్ బ్యాంకులు ఇచ్చే ఎక్కువ వడ్డీ రుణాలకు అలవాటు పడకుండా ప్రభుత్వం మంజూరు చేసే రుణాలను తీసుకొని అన్ని విధాలుగా అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ జర్నప్ప, ఏపీఎం బాలయ్యలు మాట్లాడారు. పెద్దేముల్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 947 స్వయం సహాయక సంఘాలున్నాయని, 2023–24 సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా 470 సంఘాలకు రూ.32 కోట్లు మంజూరు చేశారన్నారు. బ్యాంకులు రూ. లక్ష ఇవ్వాలన్న భూమి పట్టా పాస్‌బుక్ లేదా ఇంటి కాగితాలు పెడితేనే ఇచ్చేవని, ప్రస్తుతం స్వయం సహాయక సంఘాలకు ఆధార్‌కార్డుపైనే రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ప్రతీ మహిళా బ్యాంకు రుణాలు తీసుకొని రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు అండాలమ్మ, కార్యదర్శి అక్షయ, సహాయ కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారి మంజుల సీసీలు, ఆపరేటర్‌లు సత్యనారాయణ, అనంతయ్య, సయ్యద్, బాల్‌రాజ్, లక్ష్మణ్, వెంకట్, మంజుల, స్వప్న, నర్సమ్మ, వీరప్ప, బాలయ్య, లక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.